క్లుప్తంగా

మట్టి ద్రావణంతో మొక్కలకు పోషకాలు

పిట్టలవానిపాలెం: మట్టి ద్రావణంతో మొక్కలకు పోషకాలు సమృద్ధిగా అందుతాయని గోకరాజు నల్లి బోయినవారిపాలెం యూనిట్ ఐసీఆర్‌పీ చేబ్రోలు ఏసోబు తెలిపారు. మండల కేంద్రంలో మట్టిద్రావణాన్ని తయారు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 10కిలోల మట్టి, ఒక లీటరు ఆముదం, 100లీటర్ల నీటిని ప్లాస్టిక్ డ్రమ్ములో కలియబెట్టాలని తెలిపారు.ఈ మిశ్రమాన్ని రెండు రోజుల తర్వాత ఎకరం వరి పైరుపై పిచికారీ చేయడం వలన బ్యాక్టీరియా వృద్ధి చెంది మొక్కలు బలంగా ఎదుగుతాయని తెలిపారు. రైతులు స్వయంగా ఈ మట్టి ద్రావణాన్ని తక్కువ ఖర్చుతో తయారు చేసుకోవచ్చని తెలిపారు.

సీఆర్‌జెడ్ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలి

రేపల్లె రూరల్: మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న సీఆర్‌జెడ్ చట్టాన్ని వెంటనే నిలుపుదల చేయాలని మత్స్యకార నాయకులు పి.నాగాంజనేయులు అన్నారు. పట్టణంలో బుధవారం మత్స్యకార నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సముద్రతీరం వెంబడి 500 మీటర్ల వరకు ఉన్న భూమిలో మత్స్యకారులు జీవనోపాధికై మడ అడవుల పెంపకం, రొయ్యల చెరువుల సాగులతో జీవనం సాగిస్తున్నారన్నారు. కేంద్రం కోస్టల్ రెగ్యులైజేషన్ జోన్ పేరుతో కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ 50 మీటర్లకు ఈ పరిధిని కుదించటం విచారమన్నారు. ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. మత్స్యకార సంఘ నాయకులు విశ్వనాథపల్లి వీరరాఘవయ్య, కె.వెంకటేశ్వరరావు, కర్రి వెంకటేశ్వరరావు, శివనాగేశ్వరి, చిప్పల వీరరాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



రేపల్లె రూరల్: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని పట్టణ ఎస్‌ఐ హరిబాబు అన్నారు. సైబర్ నేరాలపై పట్టణంలోని ఆర్‌సీ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రస్తుత ఆధునిక జీవనంలో మొబైల్ ఫోన్, కంప్యూటర్ వంటి సాధానాల వినియోగం ఎక్కువైందన్నారు. వీటిని అవసరం మేరకు మాత్రమే వినియోగించాలని చెప్పారు. అపరిచిత వ్యక్తులతో తమ వ్యక్తిగత సమాచారాన్ని ఆయా పరికరాల ద్వారా పంచుకోరాదని చెప్పారు. యువత నేరాలబారిన పడకుండా అవగాహన కలిగి తోటివారిని అప్రమత్తం చేయాలని సూచించారు. అనంతరం సైబర్ నేరాలపై వివరించారు. ఐఆర్‌ఈఎఫ్ విద్యాసంస్థల డిప్యూటీ డైరెక్టర్ జాన్ రెబ్బా, పాస్టర్ లారెన్స్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డానియేలు, వంశీ, నాని, రవీంధర్, లక్ష్మీదుర్గ తదితరులు పాల్గొన్నారు.

పేరలిలో 'పొలంబడి'



పేరలి(కర్లపాలెం): మేలైన యాజమాన్య పద్ధతులు పాటించటం వలన నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారి సుమంత్‌కుమార్ తెలిపారు. పేరలి గ్రామంలో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ సామూహికంగా విత్తనశుద్ధి చేయటం ద్వారా మొలక దశలో ఆశించే తెగుళ్లను నివారించుకోగలగుతామని చెప్పారు. వరిలో తూర్పు, పడమర దిశగా కాలిబాటలు ఏర్పాటు చేయటం వలన గాలి వెలుతురు ప్రసరించి తెగుళ్లను వ్యాపింప చేసే పురుగుల ఉధృతి తగ్గుతుందని చెప్పారు. 25 రోజుల లేత నారునే నాటుకోవాలని ఒక చదరపు మీటరుకు 33 కుదుళ్ళు ఉండేట్లు దగ్గరగా నాటుకోవాలని సూచించారు. ఎక్కువ పిలకలు వేయటం వలన దిగుబడి పెరుగుతుందని సూచించారు. వ్యవసాయ విస్తరణాధికారి భాగ్యలక్ష్మి, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

23న గ్రామ సభల షెడ్యూల్ విడుదల

భట్టిప్రోలు: పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలెప్‌మెంట్ ఆదేశానుసారం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఈ ఆర్థిక సంవత్సరానికి గాను పనులను గుర్తించేందుకు మండలంలోని 15 గ్రామ పంచాయతీలలో శుక్రవారం గ్రామసభలు నిర్వహించనున్న షెడ్యూల్‌ను ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు బుధవారం ప్రకటించారు. ఆరోజు ఉదయం 10 గంటలకు ఆళ్లమూడి, చింతమోటు, ఐలవరం, కన్నెగంటివారిపాలెం, పెదపులివర్రు, 11 గంటలకు భట్టిప్రోలు, గొరిగపూడి, ఓలేరు, పెదలంక, రాచూరు, సూరేపల్లి, వెల్లటూరు, మధ్యాహ్నం 12 గంటలకు పెసర్లంక, 2 గంటలకు పల్లెకోన, 3 గంటలకు కోనేటిపురం గ్రామాలలో గ్రామ సభలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ గ్రామ సభలలో పనులను గుర్తించి తీర్మానాలు చేసి ఇవ్వాలని వివరించారు. ఎంపీడీఓతో పాటు ఈఓపీఆర్డీ, ఏపీఎం, పంచాయతీ రాజ్, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎంఈఓలు గ్రామ సభలకు నోడల్ ఆఫీసర్లుగా వ్యవహరిస్తారని తెలిపారు.



పాఠశాలలో బోధనకు ఉపయోగిస్తున్న వివిధ రకాల వస్తువులు



ప్రముఖుల చిత్రపటాలు గీసి, వారి జీవిత విశేషాలు రాస్తున్న విద్యార్థులు



విద్యార్థులు తయారు చేసిన చార్టు

కృత్యాధార బోధనతో సత్ఫలితాలు

- జీరో బేస్డ్ బడ్జెట్‌తో బోధన కృత్యాలు
- విద్యార్థుల నుంచి విశేష స్పందన
- జాతీయ విద్యావిధానానికి అనుగుణంగా బోధన

పిట్టలవానిపాలెం: అభ్యసనం అనేది అత్యంత సరళమైనది. పిల్లల స్వభావాన్ని గుర్తించి వారు అభ్యసనంలో చురుగ్గా పాల్గొనేలా చేయడం ఒక కళ. మండలంలోని పిట్టువారిపాలెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు బోధనలో ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. అన్ని తరగతుల్లోనూ ఆయా పాఠ్యాంశాలలో అన్ని అంశాలను ముందుగానే గుర్తించి ఖర్చులేని లేదా అతితక్కువ ఖర్చుతో బోధనాభ్యాసన కృత్యాలను తయారు చేసేలా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు.

కృత్యాలతో అర్థమయ్యేలా..

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో అభ్యసనా కృత్యాలు తయారీ అత్యంత ప్రధానమైనది. వీటి ద్వారా పిల్లల్లో అన్వేషణ, పరిశీలన, ఆలోచించడం, ప్రశ్నించే సామర్థ్యం పెంపొందించవచ్చు. బోధన జరపడం అంటే కేవలం చెప్పడం, వినిపించడం మాత్రమే కాదని, అది ఒక కళ అని అన్వేషణ, ప్రదర్శనలు వీటన్నింటి ద్వారా పిల్లలు ఉత్సాహంగా పాల్గొనేలా చేయడమని ఉపాధ్యాయులు నిరూపిస్తున్నారు. బోధనా లక్ష్యం అంటే విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడమే అంటున్నారు ఈ పాఠశాలలోని ఉపాధ్యాయులు. పుస్తకాలు, మేగజైన్‌లు, దినపత్రికలలో వివిధ అంశాలను చదివి వాటిని విశ్లేషించేలా చేయడం అనేవి బోధనలో భాగంగా చేసుకున్నారు. పిల్లలు ప్రశంసలు, ప్రోత్సాహాన్ని కోరుకునేలా అందమైన డిజైన్‌లతో కూడిన బోధనా కృత్యాలను తయారు చేయడంలో ఉపాధ్యాయులు పిల్లలకు శిక్షణ ఇస్తున్నారు. ఉపాధ్యాయుల సృజనాత్మకత ఉత్తేజపూరిత, స్నేహపూర్వక సమ్మిళిత వాతావరణంలో కృత్యధార బోధన చేస్తే ఆశించిన ఫలితాలు వస్తాయని అంటున్నారు. వివిధ తరగతులకు సంబంధించి పాఠ్యాంశాలలో కవుల చిత్రాలు, కవి పరిచయాలను ప్లకార్డులపై బొమ్మల రూపంలో వేయించడం, వారి గురించి సమగ్రంగా వాటిపై రాయించడం, తదుపరి విద్యార్థులకు వాటిని వివరించడం, పూర్తిగా అవగాహన వచ్చిన విద్యార్థులతో తోటి విద్యార్థులకు వాటిని బోధించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ, విద్యార్థుల్లో ఆసక్తి పెంపుదలకు కృషి చేస్తున్నారు.

విద్యార్థుల నుంచి చక్కని స్పందన



విద్యార్థులకు మానసిక ఒత్తిడి లేని విద్య అందిస్తే సత్ఫలితాలు సాధించవచ్చు. వీటిలో ప్రధానమైనవి బోధన అభ్యసనా కృత్యాలు, విద్యార్థులకు సులభమైన రీతిలో వారికి అర్థమయ్యేలా బోధిస్తే మంచి జ్ఞాపకశక్తితో ఉంటారు. ఖర్చు లేకుండా తయారు చేసే బోధన కృత్యాల ద్వారా బోధన చేస్తే విద్యార్థుల నుంచి మంచి స్పందన లభిస్తుంది. పాఠాల్లో సారాంశాలను బొమ్మల రూపంలో విద్యార్థులకు వివరించి ఊహాజనితంగా వారి సొంత మాటల్లోనే తిరిగి చెప్పేలా తర్ఫీదునిస్తున్నాం.

–పరిశ నరసింహారెడ్డి, పాఠశాల హెచ్‌ఎం

పాఠ్యాంశాలపై ఆసక్తి పెరిగింది



మా పాఠశాలలో ఉపాధ్యాయులు బోధించే సందర్భంలో ఆ పాఠాలకు సంబంధించిన సామగ్రిని తయారు చేయించి అర్థమయ్యేలా బోధిస్తున్నారు. మాకు వచ్చిన సందేహాలను నివృత్తి చేస్తున్నారు. ఇలా బోధించడం వల్ల మాకు చదువుకోవాలనే ఆసక్తి మరింత పెరిగింది.

–దోమ మధువల్లిక, 8వ తరగతి

ఒత్తిడి లేకుండా విద్య



ప్రతి రోజూ మా ఉపాధ్యాయులు పాఠాలను బోధించేటప్పుడు పాఠాలలో ఉన్న అంశాలను సులభంగా అర్థమయ్యేలా ఖర్చు లేకుండా చార్టులను తయారు చేయించి ప్రదర్శించి చర్చించడం ద్వారా బోధిస్తున్నారు. ఇలా చెప్పడం వల్ల చదువుపై ఆసక్తి పెరిగి మంచి ఫలితాలు సాధిస్తామన్న నమ్మకం కలిగింది. ఒత్తిడి లేని బోధన అందుతోంది.

– తుమ్మా గౌతమి, 6వ తరగతి

విద్యార్థుల హాజరు పెరిగింది



మా పాఠశాలలో విద్యార్థుల హాజరు పెరిగింది. ప్రతి రోజూ పాఠశాలకు వచ్చేందుకు చాలా ఆసక్తి చూపిస్తున్నారు. పాఠశాలలో నిర్వహిస్తున్న బోధనపై చాలా ఆకర్షితులవుతున్నారు. పాఠశాలలో ప్రస్తుతం 120 మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. తక్కువ ఖర్చుతో స్వయంగా తయారు చేసిన వస్తువులతో విద్యార్థులకు బోధిస్తున్నాం.

– బుద్దా నాగాంజనేయులు, ఉపాధ్యాయుడు

మురుగునీరు బయటకు వస్తే కఠిన చర్యలు

- రిసార్ట్ యజమానికి నోటీసులు జారీ చేసిన పంచాయతీ అధికారులు
- మూడు రోజుల్లో సమస్య పరిష్కరించాలి: డీపీఓ

సాక్షి ఎఫెక్ట్



లోటస్‌పాండ్ సమీపంలో పేరుకుపోయిన మురుగునీటిని పరిశీలిస్తున్న డీపీఓ వి.రవికుమార్

బాపట్లటౌన్: మండలంలోని ముత్తాయపాలెం గ్రామశివారులో నిర్మించిన లోటస్‌పాండ్ రిసార్ట్ అండ్ రెస్టారెంట్‌లోని మురుగునీరు ఏళ్ల తరబడి నిలిచి పారుదల లేకపోవడంతో విషజ్వరాలు ప్రబలడానికి కారణమైందని ఈనెల 18న 'విష జ్వరాలకు మురుగు నీరే కారణమా' అనే శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి జిల్లా పంచాయతీ అధికారి స్పందించారు. డీపీఓ వి. రవికుమార్ మంగళవారం సాయంత్రం మురుగునీరు నిలిచిన ప్రాంతాన్ని పరిశీలించి లోటస్ పాండ్ యజమానితో మాట్లాడారు. ఇప్పటికే నిర్వాహకులకు నోటీసులు జారీ చేయటం జరిగిందన్నారు. రెండురోజుల్లోగా మురుగునీటిని ఆ ప్రాంతం నుంచి తొలగించి ఆ ప్రాంతంలో ఎలాంటి మురుగులేకుండా చేస్తామన్నారు. ముమ్ముందు మురుగునీరు బయటకు రాకుండా ట్యాంక్‌లు ఏర్పాటుచేసుకొని వాటిల్లోకి వదులుకుంటామని తెలిపారన్నారు. ప్రజలు తిరిగే ప్రాంతాల్లో ఎలాంటి మురుగునీరు నిలిచిన, రోడ్లపై ఎరువు దిబ్బలు వేసినా సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం గ్రామంలోని చెత్తసేకరణ కేంద్రాన్ని పరిశీలించి తడిచెత్త, పొడిచెత్తను వేరుచేసి గ్రామంలో ఎలాంటి చెత్తనిల్వలు పేరుకుపోకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు.

పంచాయతీకి రెండు తాళాలపై డీపీఓ ఆగ్రహం

సాక్షి ఎఫెక్ట్



పంచాయతీ కార్యదర్శితో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్

కాకర్లమూడి(వేమూరు): గ్రామ పంచాయతీ కార్యాలయానికి రెండు తాళాలు వేయడం మంచి పద్ధతి కాదని బాపట్ల జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్ అన్నారు. వేమూరు మండలంలోని కాకర్లమూడి గ్రామ పంచాయతీకి రెండు తాళాలు వేసిన సంఘటనపై 'కూటమి జోక్యం.. విభేదాలకు అజ్యం' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన వార్తకు స్పందించిన డీపీఓ రవికుమార్ బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శిని పిలిపించి మాట్లాడారు. చిన్న చిన్న విభేదాలు ఉంటే పక్కన పెట్టి ఐక్యతతో పని చేసుకోవాలని సూచించారు. పంచాయతీ తాళపు చెవులు గ్రామ సర్పంచ్ వద్ద ఒకటి, పంచాయతీ కార్యదర్శి వద్ద మరొకటి ఉండాలని ఆయన సూచించారు. ఇంతవరకు ఇలాంటి పరిస్థితి ఏ పంచాయతీ కార్యాలయంలో నెలకొనలేదన్నారు. మరోసారి ఇలాంటి సమస్య ఉత్పన్నం కాకుండా చూడాలని మండల స్థాయి అధికారులను హెచ్చరించారు. ఆయనవెంట మండల పంచాయతీ అధికారి చొప్పర శేఖర్, పంచాయతీ కార్యదర్శి తేజ శ్రీ పంచాయతీ వార్డు మెంబర్లు ఉన్నారు.

రోగులతో ప్రేమగా వ్యవహరించాలి

భట్టిప్రోలు: ప్రభుత్వ వైద్యశాలలకు వచ్చే రోగులతో సిబ్బంది ప్రేమతో వ్యవహరించాలని ఎంపీపీ, పీహెచ్‌సీ చైర్‌పర్సన్ దావూరి వెంకట లలిత కుమారి అన్నారు. బుధవారం భట్టిప్రోలు పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ లలితకుమారి మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలపై ప్రజలకు ఉన్న అపోహలను తొలగించి వైద్యఆరోగ్య సిబ్బంది మెరుగైన సేవలు అందించాలని, అప్పుడే ప్రజల మన్ననలు పొందగలుగుతారని తెలిపారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు విజృంభిస్తుండటంతో సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రజలకు ఆరోగ్య సూచనలు అందించాలని కోరారు. కోల్‌కతలో మహిళా డాక్టర్‌పై జరిగిన ఘటన నేపథ్యంలో కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, సూరేపల్లి సర్పంచ్ మోర్ల విజయలక్ష్మి, పీహెచ్‌సీ వైద్యులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వినియోగదారుల సమస్యలు పరిష్కరించేందుకే అదాలత్



విద్యుత్ అదాలత్‌లో మాట్లాడుతున్న జస్టిస్ విక్టర్ ఇమ్మానుయేల్

తెనాలిరూరల్: విద్యుత్ శాఖకు సంబంధించి వినియోగదారుల సమస్యలు పరిష్కరించేందుకు కన్స్యూమర్ గ్రీవెన్సెస్ రెడ్రెస్సల్ ఫోరం (సీజీఆర్‌ఎఫ్)ను ఏర్పాటు చేసినట్టు ఫోరం చైర్మన్ జస్టిస్ ఎన్. విక్టర్ ఇమ్మానుయేల్ తెలిపారు. పట్టణ సుల్తానాబాద్‌లో తెనాలి డివిజన్ ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. విజయవాడ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ఆధ్వర్యంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకూ జరిగిన అదాలత్ కార్యక్రమంలో విద్యుత్ అధికారులతో కలిసి జస్టిస్ ఎన్ విక్టర్ ఇమ్మానుయేల్ పాల్గొన్నారు. తెనాలి డివిజన్ పరిధిలోని వినియోగదారులు సూచించిన పలు సమస్యలను నమోదు చేయించారు. డివిజన్ పరిధిలోని వినియోగదారులు రాతపూర్వకంగా తమ సమస్యలు తెలియజేయగా సుమారు ఆరు కేసుల వరకూ అక్కడికక్కడే పరిష్కరించారు. మరికొన్ని సమస్యలు సివిల్ వివాదాలతో కూడుకున్నవి కావడంతో వాటిని పరిష్కరించుకుని విద్యుత్ అధికారులను కలవాలని సూచించారు. ఈ సందర్భంగా జస్టిస్ విక్టర్ ఇమ్మానుయేల్ మాట్లాడుతూ విద్యుత్ సమస్యలు పరిష్కరించడంతో పాటు వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు విద్యుత్ అదాలత్ కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. తెనాలిలో గత ఏడాది ఈ సమావేశం నిర్వహించడం జరిగిందని, తిరిగి రెండోసారి అదాలత్ కార్యక్రమాన్ని ఇక్కడ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రజలు తమ దృష్టికి తీసుకు వచ్చిన సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సాంకేతిక సభ్యుడు కె. వెంకట కృష్ణ, ఆర్థిక సభ్యుడు ఆర్‌సీహెచ్ శ్రీనివాస రావు, స్వతంత్ర సభ్యురాలు ఎ.సునీత, విద్యుత్ జిల్లా అధికారి ఆవుల మురళీకృష్ణ యాదవ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వీవీ చిరంజీవి, ఏడీఏ బి. అశోక్‌కుమార్, తెనాలి డివిజన్ పరిధిలోని అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యువత ముందుకు రావడం అభినందనీయం



బీజేఆర్ కమిటీ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ప్రసాద్

తెనాలిరూరల్: పేదలను ఆదుకునేందుకు యువత ముందుకు రావడం అభినందనీమని సీనియర్ ఏపీపీ సుద్ధపల్లి సుకుమార్ అన్నారు. మండలంలోని నందివెలుగు గ్రామంలో ఏర్పాటు చేసిన కూచిపూడి విజయబాబు మెమోరియల్ ట్రస్ట్‌ను మంగళవారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు తెనాలి బీజేఆర్ కమిటీ అధ్యక్షుడు మేకల సురేష్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి సుకుమార్ మాట్లాడుతూ పేదలకు సేవ చేసేందుకు కూచిపూడి ప్రసాద్ తన తండ్రి పేరిట ట్రస్ట్‌ను ఏర్పాటు చేయడం ఆదర్శనీయమన్నారు. ఈ సందర్భంగా వేదికపై ఎమ్మార్పీఎస్ కార్యకర్తలను సన్మానించారు. తొలి సేవా కార్యక్రమంలో భాగంగా బీజేఆర్ తెనాలి కమిటీకి రూ. 25 వేల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో సుద్ధపల్లి మురళి, కలెవరపు దేవయ్య, అత్తోట చంటి, పొన్నగంటి రమేష్, కిన్నెర నాగరాజు, ఆలపాటి కరుణ, కొండముది బోసు బాబు, వినయ్ పాల్గొన్నారు

చిరువ్యాపారులు దేశసంపద సృష్టికర్తలు

క్లబ్ జిల్లా గవర్నర్ ఉదయ్ సుధీర్ పిలాని



పుష్‌కాట్‌లను పంపిణీ చేస్తున్న గవర్నర్ ఉదయ్ సుధీర్ పిలాని, శ్రీనివాసరావు

తెనాలిఅర్బన్: చిరువ్యాపారులు దేశ సంపద సృష్టికర్తలని రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం జిల్లా గవర్నర్ ఎస్ ఉదయ్ సుధీర్ పిలాని పేర్కొన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం మార్కెట్ యార్డులో 22 పుష్ కాట్‌లను చిరువ్యాపారులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరు వ్యాపారులు తమ వృత్తులలో నిష్ణాతులని, వారు ఇతరులపై ఆధారపడకుండా జీవనాన్ని సాగిస్తుంటారని చెప్పారు. పుష్ కాట్‌లను అద్దెకు తీసుకుని చాలా మంది ఇబ్బందులు పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వారికి చేయుత నివ్వాలని ఉద్దేశంతో వీటిని పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. అందరు వీటిని జాగ్రత్తగా ఉపయోగించుకోవాలని సూచించారు. అసోసియేషన్ తెనాలి అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు మాట్లాడుతూ జీవీకె వీవీఎల్ ఫౌండేషన్ నిర్వాహకులు డాక్టర్ బాబు ఆర్ వడ్లమూడి రూ.లక్ష, ఉదయ్ సుదీర్ పిలానీ రూ.1.50 లక్షలు వీటి కొనుగోలుకు విరాళం ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో టి. రాజశేఖరరెడ్డి, శివరంజనీ, పెరుమాళ్ళు, మురళీకృష్ణ, డి.మురళీ, వెంకటరత్నం, ఈదర వెంకట పూర్ణచంద్, చేతన్‌రాజ్, రాంబాబు, ప్రసాద్, ఉపేంద్ర, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పుష్కర ఘాట్‌లో చెత్తాచెదారం తొలగింపు

తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని సీతానగరం కృష్ణానది పుష్కర ఘాట్‌ల వద్ద బుధవారం కార్పొరేషన్ పారిశుద్ధ్య కార్మికులు క్లీనింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా డీఈ కృష్ణారెడ్డి మాట్లాడుతూ గత కొంతకాలంలో పుష్కర ఘాట్‌ల వద్ద శుభ్రం చేయకపోవడంతో ఘాట్‌మెట్లపై చెత్త పేరుకుపోవడం, మత్తబాబుల ఆగడాలకు ఘాట్ మొత్తం సీసా పెంకులు ఉండడంతో స్థానికులు కమిషనర్ అలీంబాషా దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ఆదేశాల మేరకు పుష్కర ఘాట్‌లను శుభ్రం చేసి పెయింటింగ్ వేస్తున్నట్లు వివరించారు.

వర్గీకరణ వ్యతిరేక బంద్ ప్రశాంతం



భట్టిప్రోలులో బంద్‌లో పాల్గొన్న జేఏసీ నాయకులు



రేపల్లెలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న దళిత బహుజన నాయకులు



బాపట్లలో రోడ్ల వెంట తిరుగుతూ దుకాణాలు మూయిస్తున్న మాల మహానాడు నాయకులు

భట్టిప్రోలు: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను నిరసిస్తూ జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన భారత్‌బంద్ భట్టిప్రోలులో ప్రశాంతంగా జరిగింది. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. జేఏసీ నాయకులు జడా రవీంద్రబాబు, నాయకులు పీజీ అరుణ్‌శాస్త్రి, దారా చెన్నయ్య, దావూరి నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఎస్‌ఐ ఎం.శివయ్య ఆధ్వర్యంలో పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశారు.

పిట్టలవానిపాలెంలో...

పిట్టలవానిపాలెం: వర్గీకరణకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న భారత్ బంద్‌లో భాగంగా పిట్టలవానిపాలెం మండలం అల్లూరులో యువకులు బంద్‌ను ప్రశాంతంగా నిర్వహించారు. చందోలు ఎస్‌ఐ స్వామి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు చేపట్టారు.

చెరుకుపల్లిలో...

చెరుకుపల్లి: ఎస్సీ వర్గీకరణ తీర్పును వ్యతిరేకిస్తూ మండల దళిత సంఘాల వారు బుధవారం చెరుకుపల్లిలో నిరసన వ్యక్తం చేశారు. ఐలాండ్ సెంటర్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘ నాయకుడు తురిమెళ్ళ శ్రీధర్, జై భీమ్ రావ్ భారత్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి న్యాయవాది దోవా రమేష్ రాంజీలు మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ సిహెచ్ పద్మావతికి వినతిపత్రం అందజేశారు. న్యాయవాది కర్రా ప్రతాప్, మంచాల విజయ్ కిషోర్, బడుగు చంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

రేపల్లెలో...

రేపల్లె రూరల: ఎస్సీ వర్గకరణపై పట్టణంలో దళిత బహుజన నాయకులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలో బుధవారం వివిధ వార్డుల దళిత బహుజన సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించి అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేశారు.

కొల్లూరులో...

కొల్లూరు: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును వెనక్కి తీసుకోవాలని కోరుతూ చేపట్టిన భారత్‌బంద్‌లో భాగంగా కొల్లూరులో బంద్ పాక్షికంగా జరిగింది. మాలమహానాడు ఆధ్వర్యంలో యువకులు ఆర్టీసీ బస్సును నిలిపి నిరసన వ్యక్తం చేశారు. బంద్ ప్రభావం దుకాణాలు, వ్యాపార సంస్థలపై కనిపించలేదు.

పోలీసుల పటిష్ట బందోబస్తు..

బాపట్లటౌన్: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ దళిత సంఘాలు భారత్ బంద్‌కు బుధవారం పిలుపునిచ్చాయి. దానిలో భాగంగా జిల్లాలో ఎక్కడా కూడా అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ఎస్పీ తుషార్‌డూడీ ఆధ్వర్యంలో తెల్లవారుజామునుంచే పోలీసులు అప్రమత్తమయ్యారు. బాపట్లలోని రైల్వే స్టేషన్, పాతబస్టాండ్, గడియార స్తంభం సెంటర్, ప్రభుత్వకార్యాలయాల ప్రాంగణం, ఆర్టీసీ బస్టాండ్లు, జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో పోలీసులు అధికసంఖ్యలో బందోబస్తు నిర్వహించి ఎక్కడా కూడా అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా చూశారు.

బాపట్లలో...

బాపట్ల: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చేయొచ్చని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు నిరసనగా దళిత సంఘాలు చేపట్టిన బంద్ బాపట్లలో విజయవంతమైంది. వర్గీకరణ నిలుపుదల చేయాలని కోరుతూ పట్టణంలో నిరసన కార్యక్రమం బుధవారం చేపట్టారు. డాక్టర్ చార్వాక ఆధ్వర్యంలో పలు సంఘాల నాయకులు వివిధ ప్రభుత్వ కార్యాలయాల వద్దకు వెళ్లి నిరసన తెలియజేశారు. దళిత సంఘాల నాయకులు అమ్మేశ్వరరావు, శీలం రోజన్‌బాబు, సలగల చంటి తదితరులు ఉన్నారు.

కర్లపాలెంలో...

కర్లపాలెం: కర్లపాలెంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యువజన సేవా సమాఖ్య కర్లపాలెం మండల గౌరవాధ్యక్షుడు మందపాటి ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణకు నిరసనగా బుధవారం ఆందోళన నిర్వహించారు.

వేమూరులో...

వేమూరు: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేకిస్తు బుధవారం భారత్ బంద్ నిర్వహించడం జరిగిందని మాల మహానాడు నాయకుడు బస్సా నాగరాజు అన్నారు. మండల కేంద్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, దుకాణాలు మూసి వేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

వైభవంగా ఆలయ గోపుర కలశ ప్రతిష్ట

ఫిరంగిపురం: మండలంలోని శిరంగిపాలెంలోని బాలాంజనేయస్వామి గోపుర కలశ ప్రతిష్ట కార్యక్రమాల్లో భాగంగా బుధవారం రెండో రోజు విశేషపూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలోని ముఖమండపంలో వైఖనస ఆగమ పండితులు దీవి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో పూజ కార్యక్రమాలు చేశారు. సాయంత్రం యాగశాలలో ఆలయ కలశాలు, శీతల యంత్రం, ధ్వజస్తంభానికి విశేషపూజలు, జలాధివాసం, క్షీరాధివాసం, పంచగవ్యాధివాసం, అధివాసాలు నిర్వహించి నవగ్రహారాధనలు రుత్వికులు సురేషకుమార్, గోవర్ధన్‌రఘురామ్, సురేష్, రామకృష్ణ, నాగఫణి నిర్వహించారు. శీతల యంత్రాన్ని విశేషంగా అలంకరించిన వాహనంలో ఉంచి గ్రామంలో ఊరేగించారు.

అక్రమ కేసులు బనాయించడం దారుణం

మంగళగిరి: కేసులతో సంబంధం లేకపోయినా అ క్రమ కేసులు బనాయించడం దారుణమని వైఎస్సార్ సీపీ నాయకుడు దాసరి వీరయ్య పేర్కొన్నా రు. పట్టణంలోని ఐబీఎన్ ప్రెస్‌క్లబ్ భవనంలో బు ధవారం వీరయ్య ఆయన సతీమణి దుగ్గిరాల జెడ్పీ టీసీ సభ్యురాలు మేకతోటి అరుణతో కలసి విలేకరులతో మాట్లాడారు. మంత్రి నారా లోకేష్ నిర్వహించిన ప్రజాదర్బార్‌లో తెనాలికి చెందిన సుధారాణి తనపై ఫిర్యాదు చేసినట్లు సోషల్ మీడియాలో వచ్చిన వార్తలలో నిజం లేదన్నారు. తనపై తప్పు డు కేసు బనాయించాలని టీడీపీ నాయకుల ఒత్తిడితోనే సుధారాణి ఫిర్యాదు చేసినట్లు తెలిసిందన్నారు.

బాల్యవివాహాలతో ఆరోగ్య సమస్యలు



ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు జెడ్పీ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు బాల్యవివాహం చేసుకోవడం వలన కలిగే ఇబ్బందులపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ చిన్న వయస్సులో బాల్యవివాహాలు చేసుకోకూడదని చెప్పారు. దీనివల్ల ఆరోగ్యపరమైన ఎన్నో సమస్యలు వస్తాయన్నారు. ఎవరైన బలవంతంగా బాల్య వివాహం చేయిస్తున్నా చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్ 1098కి ఫోన్ ద్వారా తెలియజేయాలని చెప్పారు. అనంతరం విద్యార్థులతో మానవహారంగా నిలిచి వారిచే బాల్యవివాహ నిషేధ చట్టం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎ. ఇమ్మానియేల్, ఉపాధ్యాయురాలు సుజాత, అంగన్‌వాడీలు సునీత, సీతారాఘవ, ఏఎన్‌ఎం మేరిశిరీష పాల్గొన్నారు.